క్లుప్తంగా

త్వరగా పూర్తి చేయాలి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని దేవదాయ శాఖ డీఈ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆలయంలో నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ. 2కోట్లతో భక్తులకు ప్రత్యేక క్యూలైన్, విడిది గదులు, ఇతర నిర్మాణాలకు సంబంధించి పనులు త్వరగా పూర్తి చేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



కోడుమూరులోని దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: దుకాణదారులు ఎరువులను అధిక రేట్లకు విక్రయించినా, యూరియా కొరత సృష్టించినా చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. గురువారం కోడుమూరులోని ఎరువుల దుకాణంలో ఏఓ రవిప్రకాష్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఎరువులకు సంబంధించి రికార్డులను పరిశీలించడంతో పాటు, రైతులతో మాట్లాడారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలో యూరియా కొరత ఎక్కడా లేదన్నారు. కోడుమూరు, అనుగొండ, అమడగుంట్ల, ఎర్రదొడ్డి, ముడుమలగుర్తి, ప్యాలకుర్తి, వర్కూరు, పులకుర్తి, లద్దగిరి, గోరంట్ల రైతు సేవా కేంద్రాలతో పాటు, ఎరువుల దుకాణాల్లో కలిపి మొత్తం 100 టన్నులకు పైగా యూరియా అందుబాటులో ఉందని ఏఓ వివరించారు. యూరియా అవసరమైన రైతులు మాత్రమే కొనుగోలు చేయాలని, పుకార్లను నమ్మి అనవసరంగా కొని నిల్వ పెట్టుకోవద్దని ఏఓ రవిప్రకాష్ రైతులకు సూచించారు.

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరువు



పాఠశాల సమస్యలపై ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి అర్జీ ఇస్తున్న టీచర్లు

సి.బెళగల్: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలపై గురువారం నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి ఏకరువు పెట్టారు. పాఠశాల ప్రహరీ అసంపూర్ణంగా ఉందని, మంచినీటి సమస్య ఉందని, నీరు లేక విద్యార్థుల మరుగదొడ్లు వినియోగించడం లేదని, మూడు పీఈటీ పో స్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొంటూ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ రాణెమ్మ, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ఆర్టీసీ బస్టాండులో మృతి చెందిన వ్యక్తి వివరాలు లభ్యమయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కుటుంబం వచ్చి మృతుడిని గుర్తించారు. వివరాలు.. తెలంగాణ రాష్ట్రం, వనపర్తి జిల్లా, గోపాల్‌పేట్ మండలం బుద్దారం గ్రామానికి చెందిన ఆంజనేయ గౌడ్ ఈ నెల 6న తొలి ఏకాదశి పండుగ రోజు మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో భార్య లక్ష్మి గొడవ పడింది. తర్వాత 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి అతడు కనిపించకుండా పోయాడు. తండ్రి అదృశ్యంపై కుమారుడు భానుప్రకాష్ గౌడ్ 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు గోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడు కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్ సమీపంలో మృతి చెందినట్లు మరుసటి రోజు దినపత్రికల్లో రావడంతో కుటుంబ సభ్యులు వచ్చి ఆంజనేయ గౌడ్‌గా నిర్ధారించారు. అతని మృతిపై ఎలాంటి అనుమానాలు లేనప్పటికీ విచారణ జరిపి నిజాలు తేల్చాలని కుటుంబసభ్యులు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అలరించిన 'సాయి లీలలు' నాటకం



నాటకంలో అలరించిన సన్నివేశం

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక సమితి సౌజన్యంతో గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో 'శ్రీ షిరిడీ సాయి లీలలు' చారిత్రక భక్తి నాటకాన్ని ప్రదర్శించారు. సాయిబాబాగా విశ్రాంత ఎస్ఐ, నంది అవార్డు గ్రహీత గుర్రపుసాల అంకయ్య, చాంద్‌పాటేల్‌గా మధుర గాయకులు పి.షేక్షావలి, బాలబటేగా ఎన్వీ సుబ్బయ్య, మహల్ సాపతిగా వెంకటేశ్వర్లు నటించారు. హార్మోనిస్టు వెంకటేశ్వర్లు, తబలిస్ట్ గోవర్ధన్ సహకారం అందించారు. నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సాయి భక్తులు, నాటకాభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

యూరియా.. లేదయ్యా..!

- గడివేముల మండలంలో అరకొరగా నిల్వలు
- పోలీసుల పహారాలో యూరియా పంపిణీ
- ఎకరాకు బస్తా మాత్రమే సరఫరా
- యూరియా కోసం వెళ్తే ఇతర ఎరువులు అంటగడుతున్న ప్రైవేట్ డీలర్లు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



పోలీసు పహారాలో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం



గడివేముల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలో నిలబడిన రైతులు

గడివేముల: మండలంలోని రైతులు సాగుకు వినియోగించే యూరియా ఎరువు అరకొరగా సరఫరా చేస్తున్నారు. దాంతో సరిపడా ఎరువులు లేకుండా పంటలను ఎలా సాగు చేయాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఆరకొరగా పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఇంకా అందుబాటులో ఉంచలేదు. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా నిలువలు ఉన్నప్పటికీ వారు ఇంకో ఎరువు కొంటేనే ఇస్తామని నిబంధన పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

22 వేల ఎకరాల్లో పంటల సాగు..

మండలంలో వర్షాలు ఓ మోస్తరుగా కురుస్తుండటంతో పాటు బొర్ల కింద ఇప్పటికే ప్రత్తి, మొక్కజొన్న, సోయాబీన్, మినుము, పంటలు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 22 వేల ఎకరాల దాకా వివిధ పంటలు సాగుచేస్తున్నారు. అధికశాతం డీఏపీ, పోటాష్, గ్రోమోర్ తదితర కాంప్లెక్స్ ఎరువులు వాడుతారు. కాంప్లెక్స్ ఎరువులు బస్తా రూ.1300 పైగా ఉండటం వల్ల వీటిని తక్కువ మోతాదులో వినియోగిస్తారు. అయితే యూరియా ధర అతి తక్కువగా రూ.266 ఉండటం, దీనిని పంటలకు వేయడం వల్ల ఎదుగుదల, పంట ఆకు పచ్చగా పెరగడంతో యూరియా పట్ల రైతులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు.

ఎకరాకు బస్తా మాత్రమే

విత్తనాలు నాటి పది నుంచి ఇరవై రోజుల కావడంతో ఎరువుల వేయాలంటే అందులో యూరియా తప్పనిసరిగా వేయాల్సి వస్తుంది. రెండు వారాల నుంచి యూరియా సరఫరా లేదు. దీంతో సహకార సంఘాల్లో తమ వద్ద అరకొర నిల్వల విక్రయంతో నెట్టుకొస్తున్నారు. ఎకరాకు ఒక బస్తా మాత్రమే యూరియా ఆందిస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక బస్తా ఏ మూలకు సరిపోదని, ఈ ఏడాది ఇక పంటలు పండించినట్లేనని నిట్టూరుస్తున్నారు.

మనోడైతే ఓకే

మన కావాల్సిన వాడైతే ఓకే ఎన్ని కావాలంటే అన్ని బస్తాలు ఇవ్వడానికి ప్రైవేట్ డీలర్లు వెనుకాడటం లేదు. యూరియా కోసం రైతులు డీలర్ల వద్ద అడుక్కునే పరిస్థితి ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఎరువుల కోసం ఏనాడు ఇబ్బందులు పడలేదని గుర్తు చేసుకుంటున్నారు. యూరియా అదులో అందించకపోతే పంటలు దెబ్బతినే పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు.

ప్రైవేటు డీలర్ల వద్ద తరుగుతున్న నిల్వలు

ప్రస్తుతం మండలంలోని రైతులకు ప్రైవేటు డీలర్ల ద్వారా యూరియా, ఇతర ఎరువులను అందిస్తున్నారు. కొందరు స్థానిక రైతులే కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి బంధువుల కోసం ఎరువులను ఇక్కడి నుంచి తీసుకెళ్తున్నారని, దీనివల్ల యూరియా నిల్వలు తరిగిపోతున్నాయని డీలర్లు చెబుతున్నారు. అంతేకాక గత కొన్ని రోజుల నుంచి యూరియా సరఫరా కావడం లేదని, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అదనంగా మాత్రం వస్తున్నాయంటున్నారు. దీనివల్ల నిల్వలు తగ్గిపోవడంతో పరిమితంగా యూరియా అందిస్తున్నామంటున్నారు. మండలంలో పీఏసీఎస్‌లో అరకొరగా యూరియా నిల్వలు ఉండటంతో రైతులు క్యూలో నిలబడి పోలీసుల పహారాలో పంపిణీ చేస్తున్నారు. ఇక గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల ఊసేలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందుబాటులో ఎరువులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు అవసమైన ఎరువులను గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించేవారు. రైతులకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లోని కియోస్క్ మిషన్‌లో ఆర్డర్ చేసుకునేవారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఎరువుల కొరత లేకుండా గత ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకునేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతులకు కష్టాలు వచ్చాయని రైతుల ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని సరిపడినంత మేర యూరియా అందించాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

ఎరువులు అందించాలి



రైతు సేవా కేంద్రాల ద్వా రా ఎరువులు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు పూర్తి స్థాయిలో కూటమి ప్రభుత్వం అందించలేకపోతుంది. యూరియా దొరకక ఇబ్బందులు పడుతున్నాం. సహకార సంఘం కార్యాలయంలో అరకొరగా యూరియా రావడంతో రైతులు క్యూలో నిలబడిన రెండు మూడు కంటె ఎక్కువ ఇవ్వడం లేదు. ఇప్పటికే పంటలు మొలకలు రావడంతో అదును దాటిన తరువాత యూరియా వేసిన లాభం లేకుండా పోతుంది. గత వైఎస్సార్ ప్రభుత్వంలా రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందించాలి.

–తలారీ బాలచెన్ని, రైతు, గడివేముల

యూరియాతో పాటు మరో ఎరువు కొనాలి



యూరియా కావాలంటే మరోక ఎరువు కొంటే నే ఇస్తున్నారు. దీంతో అవసరం లేకున్నా కాంప్లెక్స్ ఎరువులు కొనాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మొక్కజొన్నకు యూరియా ఎంతో అవసరం. సీజన్ ప్రారంభంలోనే ఇలా ఉంటే అన్ని పంటలు సాగు చేసినప్పుడు యూరియా కోసం ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందో. అధికారులు స్పందించి రైతులకు అవసరమైన యూరియా ఎరువును సమృద్ధిగా అందివ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఊశేని, రైతు, గడివేముల

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కర్నూలు(రూరల్): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కోడుమూరు నియోజకవర్గం, కర్నూలు మండలంలో వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ గురువారం పార్టీ కేంద్రం కార్యాలయం ఓ ప్రకటన జారీ చేసింది.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సి.బెళగల్ మండలాధ్యక్షులు

సి.బెళగల్: మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా దస్తగిరి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎస్.లలితమ్మ, బీసీ సెల్ బీ.రాజు, ఎస్సీ సెల్ బొజ్జన్న, ఎస్టీ సెల్ ఎరుకల రాజు, మైనార్టీ సెల్ మహ్మద్ రఫీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ పి.గోరంట్ల, స్టూడెంట్ వింగ్ ఎస్.ఇబ్రహీం, పంచాయతీరాజ్ వింగ్ కురువ మద్దిలేటి, ఆర్టీఐ వింగ్ వై.నాగేష్, వలంటీర్ వింగ్ బీ.తిరుమలేష్, బూత్‌మీటింగ్ ఎస్.రాజు, వాణిజ్య విభాగం గోవిందు, వైఎస్సార్‌టీయూసీ రుక్మంద, కల్చరర్ వింగ్ గొల్ల సోమన్న, సోషల్ మీడియా వింగ్ రంగనాయుడు, దివ్యాంగుల విభాగం ఎస్.మహబూబ్‌బాషా, డాక్టర్స్ వింగ్ జీ.పెద్ద కొండయ్య, ఇంటలెక్చువల్ ఫోరం గోవర్ధన్‌రెడ్డి, పబ్లిసిటీ వింగ్ బి.రామాంజనేయులు, రైతు విభాగం అధ్యక్షుడిగా బోయ సోమన్న నియమితులయ్యారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల గూడూరు మండలాధ్యక్షులు

విభాగం	అధ్యక్షుడు
యూత్ వింగ్	గొల్ల శేఖర్
మహిళా విభాగం	ఎస్.అజీమ్ మున్నీసా బేగం
రైతు విభాగం	పంచలింగాల రంగారెడ్డి
బీసీ సెల్	బోయ లక్ష్మన్న
ఎస్సీ సెల్	కె.నాగేష్
మైనార్టీ సెల్	ఎం.మౌలాలి
స్టూడెంట్ వింగ్	జి.మహేష్
పంచాయతీ రాజ్ వింగ్	కె.అంజనేయులు
ఆర్‌టీఐ వింగ్	పింజరి చిన్న వలి
వలంటీర్స్ వింగ్	ఎం.రాజు
పబ్లిసిటీ వింగ్	సి.భాస్కర్‌రెడ్డి
గ్రీవెన్స్ సెల్	ఉప్పరి మద్దిలేటి
వాణిజ్య విభాగం	జి.రామాంజినేయులు
పబ్లిసిటీ వింగ్	సి.భాస్కర్‌రెడ్డి
వైఎస్సార్‌టీయూసీ	బి.దస్తగిరి
కల్చరల్ వింగ్	పి.చిన్న సాంబశివుడు
సోషల్ మీడియా వింగ్	కె.కొండా రెడ్డి
ఇంటిలెక్చువల్స్	కె.వెంకటరమణరెడ్డి

కర్నూలు మండలం ..

విభాగం	అధ్యక్షుడు
యూత్ వింగ్	కోట్ల మధుకుమార్
మహిళావిభాగం	సుమలత
బీసీ సెల్	కృష్ణ
ఎస్సీ సెల్	వెంకటేశ్వర్లు
మైనార్టీసెల్	ఎస్.మహబూబ్ బాషా
స్టూడెంట్ వింగ్	బోయ శ్రీధర్
పంచాయతీరాజ్ వింగ్	కురువ సంపత్‌కుమార్
ఆర్.టీ.ఐ.విభాగం	బి.శేఖర్
వలంటీర్స్‌విభాగం	కె.ప్రవీణ్
గ్రీవెన్స్ సెల్	టీ.వీరారెడ్డి
వాణిజ్య విభాగం	బోయ సురేంద్రబాబు
వైఎస్సార్ ట్రేడ్ యూనియన్	సైమన్
కల్చరల్ వింగ్	పి.శేఖర్ రెడ్డి
సోషల్‌మీడియా వింగ్	ఉదయ్‌కిరణ్ రెడ్డి
ఐటీ వింగ్	రాజశేఖర్ రెడ్డి
మేధావుల ఫోరం	ఎం.ప్రతాప్
బూత్ కమిటీ విభాగం	ఎం.వినోద్‌కుమార్
పబ్లిసిటీ విభాగం	పి.నాగిరెడ్డి
రైతు విభాగం	కురువ నాగరాజు

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కోడుమూరు మండలాధ్యక్షులు

విభాగం	అధ్యక్షుడు
యూత్ వింగ్	జి.సాయి ముఖేష్
మహిళా విభాగం	బోయ మాధవి
రైతు విభాగం	కె.పెద్ద వెంకటేష్
బీసీ సెల్	బి.గిడ్డయ్య
ఎస్సీ సెల్	సురేష్
మైనార్టీ సెల్	ఎస్.షేషావలి
స్టూడెంట్ వింగ్	బోయ మధు
పంచాయతీ రాజ్ వింగ్	పి.తిరుపతయ్య
ఆర్‌టీఐ వింగ్	తిరుమల
వలంటీర్స్ వింగ్	బి.మధు
పబ్లిసిటీ వింగ్	సంగాల రవి
గ్రీవెన్స్ సెల్	బి.భాస్కర్‌రెడ్డి
వాణిజ్య విభాగం	సత్యారెడ్డి
వీవర్స్ వింగ్	ఎం.రవిబాబు
వైఎస్సార్‌టీయూసీ	డి.భాస్కర్
కల్చరల్ వింగ్	చక్రపాణిరెడ్డి
సోషల్ మీడియా వింగ్	ఎస్.మద్దిలేటి
ఐటీ వింగ్	ఎం.రవిశంకర్‌రెడ్డి
ఇంటిలెక్చువల్స్	జి.వెంకటశివుడు
బూత్ కమిటీ వింగ్	కె.పుల్లా రెడ్డి

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు





సాయి పల్లకీని ఊరేగిస్తున్న దృశ్యం, సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు



కోడుమూరు కోటవీధిలో ప్రత్యేక అలంకరణలో శ్రీసాయిబాబా

పాణ్యం: మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం పాణ్యంలోని జాతీయ రహదారిపై నర్సరీ వద్ద వెలసిన సాయిబాబా ఆలయానికి ఉదయం నుంచి భక్తులు తాకిడి పెరిగింది. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సాయిబాబా పల్లకీని పూలమాలతో అలంకరించి ఊరేగించారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే రైల్వే గేటు వద్ద వెలసిన సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కొణిదేడు గ్రామ సమీపంలోని భూపనపాడు గ్రామ రస్తాలో వెలసిన సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి.

కోడుమూరు రూరల్: గురుపౌర్ణమి పర్వదినాన్ని గురువారం మండల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. కోడుమూరులోని కోటవీధి, ప్యాలకుర్తి, పులకుర్తి గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివెళ్లి సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల వద్ద సాయి భక్త బృందం సభ్యులు వందలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం నాయీబ్రాహ్మణ సేవా సమితి సభ్యులు సాయిబాబా చిత్రపటాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు.



సోమయాజులపల్లెలో సాయిబాబాను దర్శించుకున్న భక్తులు

ఓర్వకల్లు : మండలంలోని సోమయాజులపల్లె గ్రామంలో వెలసిన శ్రీరామరామేశ్వర, షిర్డీసాయి బాబా దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు భోగేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వాముల వారికి పంచామృత అభిషేకం, గోక్షరాభిషేకం, నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి గజమాలతో, వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. బాబాకు పల్లకోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణంలో అశ్వర్థనారాయణస్వామి కల్యాణం జరిపించారు. ఆలయ వ్యవస్థాపకులు బచ్చు అమృతేశ్వరగుప్త, మధులత, శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో దీపాబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

బోర్డు మార్చండి సారూ !



ఎంపీడీఓ కార్యాలయంలో బోర్డులో మారని జిల్లా పేరు

గడివేముల: కొత్త జిల్లాలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా గడివేముల ఎంపీడీఓ కార్యాలయం వద్ద బోర్డులో ఇప్పటికీ కర్నూలు జిల్లా ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గడివేముల ప్రస్తుతం నంద్యాల జిల్లాలో ఉంది. ఇప్పటికీ సుమారు ఐదుగురు దాకా ఎంపీడీఓలు మారినప్పటికీ పాతబోర్డునే కొనసాగిస్తుండటం విశేషం అంటూ స్థానికులు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొత్తబోర్డును ఏర్పాటు చేసి నంద్యాల జిల్లాగా మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా పరిషత్ సీఈఓ నాసరెడ్డి అన్నారు. గురువారం చిన్నటేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీ సీఈఓ పాల్గొన్నారు. జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ పాఠశాలలో మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ (తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమా వేశం) నిర్వహించడం వల్ల విద్యార్థులకు మెరుగైన విద్యనందిచవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, ఎంఈఓ శ్రీనివాసు లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

☛ పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్ హెచ్ఓ) డాక్టర్ పి. శాంతికళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

☛ ఎ.గోకులపాడు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ హాజరై మాట్లాడారు.

గడివేముల: మండల పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలో గురువారం మెగా పేరెంట్ టీచర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ,ఎంపీడీఓ వాసుదేవగుప్తా పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని 50 మండల ప్రాథమిక పాఠశాలలు, 16 జిల్లా పరిషత్ హైస్కూళ్లు, కస్తూర్బా బాలికల విద్యాలయం, దిన్నెదేవరపాడు విజ్ఞాన పీఠంలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బోధనాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి



కొండాపురంలో ఎక్స్‌రే పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: గ్రామాల్లో ప్రజలకు నిర్వహిస్తున్న ఉచిత క్షయ (టీబీ) పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని టీబీ డివిజన్ సూపర్‌వైజర్ నాగమహేంద్ర సూచించారు. గురువారం మండల పరిధిలోని కొండాపురంలో పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ అనీస్‌తో కలిసి వైద్య శిబిరం నిర్వహించి, గ్రామంలోని 59 మంది టీబీ అనుమానితులకు ఉచితంగా ఎక్స్‌రే, గళ్ల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీ నిర్ధారణ పరీక్షల కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, 60 సంవత్సరాల పైబడి వయస్సు ఉండి, బీపీ, షుగర్, ఆయాసం, దగ్గు లక్షణాలు ఉన్న వారికి గళ్ల పరీక్షలను నిర్వహిస్తామన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలల పాటు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున చెల్లించడం జరుగుతుందని నాగమహేంద్ర తెలియజేశారు. టీబీ అధికారులు వేణుగోపాల్ ఆచారి, మల్లి, ఎంఎల్‌హెచ్‌పీ భరత్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన



సి.బెళగల్ విలేజ్ క్లీనిక్‌లో తనిఖీలు చేస్తున్న 104 జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు

సి.బెళగల్: ప్రణాళికబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం ఉండాలని సంచార వైద్య సేవల జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. గురువారం మండల కేంద్రం సి.బెళగల్లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ క్లీనిక్)లో వైద్య సేవలను ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు మిధున్‌కుమార్ రెడ్డితో కలిసి విలేజ్ క్లినిక్‌లో గ్రామస్తులకు అందుతున్న వైద్య సేవలు, రికార్డులు, నివేదికలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ రఘు గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మాతృత్వంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తల్లి కావడానికి సరైన వయసు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భాధారణకు అనుకూలమని ఆయన అన్నారు. మహిళలు తల్లి కావడానికి కనీస వయసు 18 సంవత్సరాలుగా, పురుషుడి వయసు 21 సంవత్సరాలుగా నిర్ధేశించినట్లు డాక్టర్లు తెలియజేశారు. అదేవిధంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పీపీఐయూసీడీ, అంతర ఇంజెక్షన్, కండోమ్, గర్భనిరోధక మాత్రలపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రభావతి, ఏఎన్‌ఎం అరుణకుమారి, ఆశా వర్కర్లు తదితరులు ఉన్నారు.

వైద్యురాలి ఇంట్లో చోరీ

కర్నూలు: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాజువాలిటీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ అఫ్రీన్ ఇంట్లో దొంగలు పడి అందినకాడికి దండుకుని పరారయ్యారు. ఈమె బాలాజీ నగర్‌లో నివాసముంటున్నారు. మంగళవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నంద్యాలకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలో ఉన్న అరకిలో వెండి, రూ.4 వేలు నగదు తీసుకొని ఉడాయించారు. వైద్యురాలు, కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. తలుపులు తెరచి ఉండటంతో గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. చోరీ జరిగిందని నిర్ధారించుకుని కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

పాఠశాలలో వసతులు కరువు



కుళాయిల వద్ద అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం



మీటింగ్ సందర్భంగా ఏర్పాటుచేసిన వాటర్ క్యాన్లు

కల్లూరు: కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో మండల పరిషత్ పాఠశాల(తెలుగు మీడియం), ఉర్దూ పాఠశాల ఒకే ఆవరణలో ఉన్నాయి. ఆ రెండు పాఠశాలలో సుమారుగా 250 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అక్కడ ఉన్న రెండు పాఠశాలలకు నాలుగు టాయిలెట్లు మాత్రమే ఉన్నాయి. టాయిలెట్ల పక్కనే వంట ఉంది. విద్యార్థులు నీళ్లు తాగడానికి వాటర్ ప్లాంట్ లేదు. మున్సిపాలిటీ నీళ్లు తాగాలి. లేకపోతే ఇంటి దగ్గర నుంచి వాటర్ బాటిళ్లు తెచ్చుకోవాల్సి వస్తుంది. గురువారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు సమ్మేళనం (మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం) నిర్వహించారు. దీంతో విద్యార్థులు తాగడానికి వాటర్ క్యాన్లను ఏర్పాటు చేశారు. మిగతా రోజుల్లో పాఠశాలలో ఉన్న కుళాయిల నుంచి మున్సిపల్ నీరు తెచ్చుకొని తాగాల్సి ఉంది. కుళాయిల వద్ద అపరిశుభ్రంగా ఉంది.

నిరుపయోగంగా నీటి తొట్టె



నీరు నింపకపోవడంతో వృథాగా మారిన పశువుల నీటి తొట్టె

కర్నూలు(రూరల్): పశువులు, మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నీటి తొట్టెల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఒక్కొక్క తొట్టెను రూ.33 వేల వ్యయంతో నిర్మించారు. కర్నూలు మండల పరిధిలో పశుసంపద ఉన్న గ్రామాల్లో 19 తొట్టెలు మంజూరయ్యాయి. వీటిలో 12 పూర్తి చేశారు. 7 నీటి తొట్టెలు నిర్మాణంలో ఉన్నట్లు ఉపాధి హామీ పథకం అధికారులు తెలిపారు. తొట్టెల్లో నీటిని నింపే బాధ్యతను పంచాయతీలకు అప్పగించారు. పంచాయతీ బోర్ల నుంచి పైప్‌లైన్ ఏర్పాటు చేసి తొట్టెలకు నీరు నింపేలా కొళాయిలు ఏర్పాటు చేయించారు. ఈ పనులన్నీ పూర్తయినా తొట్టెల్లో నీరు నింపకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో పశువుల నీటి తొట్టెను నిర్మించారు. తొట్టెలో నీరు నింపకపోవడంతో ఆవులు, బర్రెలు, గొర్రెలు, మేకలు దాహంతో తొట్టె చుట్టూ తిరుగుతున్నాయి. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే తొట్టెను నీటితో నింపడం లేదని పశువుల కాపరులు వాపోతున్నారు. ఇప్పటికై నా అయిన గ్రామ పంచాయితీ అధికారులు స్పందించిన పశువుల తొట్టెలను నీటితో నింపి మూగ జీవాల దాహం తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.